విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

సోమవారం 03 మార్చి 2025   8 పేజీలు

'మేజర్ల'కు అందని సాగునీరు

- ఎండుతున్న వరి పైరు
- ఆరుతడి పంటలకు అందని ద్రాక్షే

విశాలాంధ్ర - తాళ్లూరు: దిగువ మేజర్ కాలువలకు సాగర్ నీరు అందని ద్రాక్షగా మారింది. ప్రకృతి వైప రీత్యాలతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగులుతున్నా సాగుపై ఆశతో మళ్లీ సాగు ప్రారంభిస్తున్నప్పటికి అందుకు సాగు నీటి అధికారులు సైతం సహకరించక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మేజర్లకు పంటలు బాగా పొట్ట మీద ఉన్న సమయంలో నీరు అందక ఎండు ముఖం పట్టాయి. దీంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వేలకు వేలు పెట్టుబడులు పెట్టిన ఈ తరణంలో నీరు అందకుంటే మా పరిస్థితి ఏంటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్దేశిత వాటా ప్రకారం నీరు రావటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కరువది మేజర్‌కు 280 క్యూసెక్కులు నీరు రావాల్సి ఉండగా గత పది రోజుల నుండి నీరు వచ్చిన దాఖలాలు లేవు. రజానగరం మేజర్‌కు సైతం 270 క్యూసెక్కుల నీరు మిగతా 2 లో ...

జోరుగా క్రికెట్ బెట్టింగ్

- చేతులు మారుతున్న కోట్ల రూపాయలు
- వరుస మ్యాచ్‌లతో జోరుగా పందేలు
- లాడ్జీలు, బార్‌లే కేంద్రాలు
- జేబులు ఖాళీ చేసుకుంటున్న యువత

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : క్రికెట్ ఆటను ఆస్వాదించాలి. అదే ఆట వ్యసనం అయితే ఇల్లు గుల్ల కావాల్సిందే. ప్రస్తుతం జరుగుతుంది ఇదే. ఐసీఐసీఐ మినీ వరల్డ్ కప్ టోర్నమెంట్ రసవత్తరంగా జరుగుతుంది. అంతకుముందు ఇంగ్లాండ్‌తో సిరీస్ జరిగింది. మార్చి 16 నుంచి ఐపీఎల్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లు మొదలు కానున్నాయి. ఇండియా టీం జోరుగా క్రికెట్ మ్యాచ్‌లు ఆడుతున్న నేపథ్యంలో అదే జోరుగా బెట్టింగ్స్ కూడా జరుగుతున్నాయి. బెట్టింగ్స్‌పై ఎక్కువగా యువత బానిసై లక్షల రూపాయలు కాజేసుకుంటున్నారు. మరోపక్క ఆన్‌లైన్ గేమ్‌లు కూడా ఎక్కువగా పెరిగిపోయాయి. సెల్‌ఫోన్‌లో రమ్మి బెట్టింగ్స్ కూడా ఎక్కువగా జరుగుతుంది. ఏది ఏమైనా క్రికెట్ మ్యాచ్ బెట్టింగ్స్ దారుణంగా ఉన్నాయి. యువకులకు లాడ్జీలు తీసుకోవడం టీవీల్లో వచ్చే మ్యాచ్‌లను తిలకిస్తూ మ్యాచ్ గెలుపు దగ్గర నుంచి ఓవర్లు బాల్ టు బాల్ వరకు బెట్టింగ్స్‌కు పాల్పడుతున్నారు. లాడ్జీలతో పాటు బార్ అండ్ రెస్టారెంట్‌లు వీటికి వేదికగా మారాయి. అన్ని రెస్టారెంట్‌లలో మినీ స్క్రీన్‌లను ఏర్పాటు చేసి క్రికెట్ మ్యాచ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో మద్యం సేవిస్తూ క్రికెట్ మ్యాచ్‌లు చూస్తూ జోరుగా బెట్టింగ్స్‌కు పాల్పడుతున్నారు. గతంలో చీరాల, కందుకూరు కేంద్రంగా క్రికెట్ బుకీలు తిష్టవేసి బెట్టింగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచేవారు. ప్రస్తుతం అరచేతిలో ఉన్న సెల్‌ఫోన్ ద్వారా వివిధ యాప్‌ల ద్వారా బెట్టింగ్స్‌కు పాల్పడుతున్నారు. చదువుకుంటున్న విద్యార్థుల దగ్గర నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న యువకులతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న కొంతమంది ప్రబుద్దులు కూడా క్రికెట్ బెట్టింగ్స్‌కు పాల్పడుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రస్తుతం మినీ వరల్డ్ కప్ టోర్నమెంట్ జరుగుతుంది. గత మూడు రోజుల క్రితం జరిగిన ఇండియా పాకిస్తాన్ మ్యాచ్‌లో ఒక్క ప్రకాశం జిల్లా నుంచే కోట్ల రూపాయలు చేతులు మారుతున్నట్లు తెలుస్తుంది. క్రికెట్‌లో ఇండియా పాకిస్తాన్ మ్యాచ్ అంటే మిగతా 2 లో ...

కార్మిక హక్కుల సాధన ఏఐటీయూసీతోనే సాధ్యం

- కార్మికుల రక్తం నుంచి పుట్టిన జెండా ఏఐటీయూసీ
- జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్
- ఘనంగా ఏఐటీయూసీ నాల్గోవ మహాసభ

విశాలాంధ్ర - చీరాల : కార్మికుల హక్కుల సాధన ఏఐటీయూసీతోనే సాధ్యమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు. ఆదివారం చీరాల సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఏఐటీయూసీ నాలుగొవ నియోజకవర్గ మహాసభ సీపీఐ సీనియర్ నాయకులు మేడ వెంకట్రావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ సంపద సృష్టి కార్మికులతోనే సాధ్యమని కార్మికులు సృష్టించిన సంపదను ఆధిపత్య వర్గాలు దోచుకుంటున్నారన్నారు. సంపద సృష్టించే కార్మికులను బానిసలను చేసే విధానాలను ఏఐటీయూసీ సమర్థ వంతంగా ఎదుర్కొంటోందన్నారు. దేశంలో కార్మికులు సంఘటిత ఉద్యమాలు చేపడితినే తమ హక్కులు సాధించు కోగలరన్నారు. ప్రతిపక్షంలో కార్మికుల హక్కుల కోసం మాట్లాడే రాజకీయ పార్టీలు అధికారం చేపట్టిన తరువాత కార్మికుల హక్కులను కాలరాస్తున్నారన్నారు. తమ కార్యకర్తలను పనులలో పెట్టేందుకు ఎప్పటి నుంచో పనిచేస్తున్న మిగతా 2 లో ...

మిర్చి పంటకు రూ.20వేల గిట్టుబాటు ధర ఇవ్వాలి 2 లో..

3లో

అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి

కూటమి బడ్జెట్ మాయాజాలం

- మాజీ ఉపసభాపతి కోన రఘుపతి

2లో

మిర్చి పంటకు రూ.20వేల గిట్టుబాటు ధర ఇవ్వాలి

విశాలాంధ్ర-త్రిపురాంతకం : మిర్చి పంటకు గిట్టుబాటు ధర క్వింటాకు 20 వేల రూపాయలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి డిమాండ్ చేసారు. త్రిపురాంతకం మండలంలోని మిర్చి పంటను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ బృందం పరిశీలించింది. ఈ పరిశీలన కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి, రైతు సంఘం నియోజకవర్గం కార్యదర్శి బాణాల రామయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. పొలాలో వున్న రైతులతో మాట్లాడారు. రైతులు వారితో మాట్లాడుతూ ఈ సంవత్సరం మిర్చి పంట అధిక దిగిబడి ఇవ్వలేదు అన్నారు. పంట అంత పురుగు ఆశించడంతో రైతులు తీవ్రంగా నష్టపోయమన్నారు. ములిగే నక్కపై తాటికాయ పడ్డట్టు గత సంవత్సరం కంటే తక్కువ ఉండటంతో మరింత అప్పుల వుబిలో కూరుకు పోయమని తమ గోడును వెళ్ళబుచ్చారు. ఈ సందర్భంగా వీరారెడ్డి వారికి తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకే ఈ పరిశీలనా కార్యక్రమం అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర వచ్చే వరకు రైతుల పక్షానా రైతు సంఘం ఉద్యమిస్తుంది అని హామీ ఇచ్చారు. పండించిన పంటను ప్రభుత్వం మధ్యవర్తులు లేకుండా ప్రత్యక్షంగా కొనాలని అన్నారు. క్వింటాకు 20 వేల రూపాయలు మద్దతు ధర ఇవ్వలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు కూలీలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : స్థానిక యస్. వి. కే. పి. కాలేజీలో 72-75వ సంవత్సరము బి. కామ్. పూర్తి చేసి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా యస్. వి. కె. పి. కాలేజీ ఆవరణలో స్వర్ణోత్సవ వేడుకలు వేడుకలు నిర్వహించు కొన్నారు. అప్పటి గురువులు అయిన పూటుకూరి బాలరత్నం శెట్టిని, దేవతి రాములు గణముగా సత్కరించుకొన్నారు. కాలేజ్ రోజులలో వారి వారి అనుభవాలను నెమరువేసుకొన్నారు. పూర్వపు విద్యార్థులు అయిన గోపాలుని హరిహరరావు సభకు అధ్యక్షులుగా వ్యవహరించారు. ఆర్. నారాయణ శెట్టి ఐ.ఎన్.జి. వైశ్య బ్యాంకు వైస్ ప్రెసిడెంట్, జంకె కృష్ణా రెడ్డి ఆడిటర్, సూర్య ప్రకాశరావు డిప్యూటీ కమీషనర్ కమర్షియల్ టాక్స్ రిటైర్డ్, సర్వేశ్వర భట్ తదితరులు పాల్గొని అనుభవాలను నెమరు వేసుకున్నారు.

జోరుగా క్రికెట్ బెట్టింగ్

(మొదటిపేజీ తరువాయి)

అందరిలోను ఉత్కంఠ నెలకొంటుంది. మిగితా దేశాలతో ఇండియా టీం ఆడే మ్యాచ్‌ల కన్న పాకిస్తాన్‌తో ఆడే మ్యాచ్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. అదే విధంగా సమాచార మాధ్యామాల్లో కూడా ఆ మ్యాచ్‌కే ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ గత పది రోజుల నుంచి ముందుగానే మ్యాచ్‌పట్ల అందరిలో ఉత్కంఠ రేకెత్తించే విధంగా ప్రచారం చేశారు. దీంతో ఇండియా పాకిస్తాన్ మ్యాచ్ కూడా చాలా రసవత్తరంగా మారింది. సహజంగా క్రికెట్ బెట్టింగ్ అంటే గెలుపోటములపైనే బెట్టింగ్ ఉంటుంది. కానీ పాకిస్తాన్ ఇండియా మ్యాచ్ అంటే ప్రతి ఓవర్‌లో ఎన్ని రన్స్ కొడుతారా ఈ ఓవర్‌లో ఫోర్ లేదా సిక్స్ వస్తుందా రాదా, ఈ బాల్‌కు రన్ వస్తుందా లేదా అనే, బాల్ టు బాల్ కూడా బెట్టింగ్స్‌కు కూడా పాల్పడటం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. జిల్లాలో ఎక్కువ మంది యువకులు క్రికెట్ బెట్టింగ్స్‌కు పాల్పడి ఇంట్లో ఉన్న డబ్బు తీసుకొచ్చి బెట్టింగ్స్‌కు పాల్పడుతున్నారు. దీంతో లక్షల రూపాయలు పోగొట్టుకున్న యువకులు మానసికంగా ఒత్తిడికి గురై ఆత్మహత్య ప్రయత్నాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది. దీనిపై నియంత్రణ ఉందా లేదా ఉంటే ఏ రూపంలో నియంత్రించాలి అనేది అంతుపట్టని ప్రశ్నగా మారిపోయింది.

కూటమి బడ్జెట్ మాయాజాలం

- రాష్ట్ర ప్రజలను మోసం చేసిన కూటమి సర్కార్
- ఊసే లేని మహిళల ఉచిత ప్రయాణం
- నిరుద్యోగ భృతికి కేటాయింపులు శూన్యం
- రైతు భరోసాకు అరకొర నిధులు
- సూపర్ సిక్స్ పథకాల జాడలేదు
- బాబు షూరిటీ బాండ్లు ఎక్కడ
- మాజీ ఉపసభాపతి కోన రఘుపతి ఘాటు విమర్శలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ అంతా మాయాజలంగా ఉందని రాష్ట్రానికి ఒరిగేది ఏమి లేదని ఎన్నికల వాగ్దానాలు,సూపర్ సిక్స్ పథకాలు అమలు పరచడంలో పూర్తిగా విఫలమైయ్యారని మాజీ ఉపసభాపతి, బాపట్ల నియోజకవర్గ ఇంచార్జ్ కోన రఘుపతి విమర్శించారు. వైసీపీ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూటమి ప్రభుత్వంపై ఘాటుగా విమర్శలు చేశారు. బడ్జెట్ సమావేశాల్లో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని అంకెల గారడీ బడ్జెట్‌లా ఉందన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు జమిలి ఎన్నికలు వస్తాయని అనే ఆలోచనతో ప్రజలను మభ్య పెట్టేందుకే ఈ అంకెల గారడి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే ప్రయత్నం చేశారన్నారు.ఒక రంగానికి రూ.11 వేల కోట్లు కేటాయించవలసి ఉండగా కేవలం రూ.6 వేల కోట్లు మాత్రమే బడ్జెట్లో కేటాయించారని విమర్శించారు.రైతు భరోసా రైతుని నట్టేట ముంచారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదన్నారు.ఆనాడు ఓట్ల కోసమే చంద్రబాబు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్,బాబు షూరిటీ బాండ్ అంటూ ఓటర్లను మభ్య పెట్టారన్నారు.అలాగే పేదల గృహాల ఊసే లేదని కోనా ఆగ్రహించారు.ఇక ఎస్సీ,ఎస్టీ,బీసీలకు సంక్షేమ నిధులు కేటాయించలేదని అంతా అబద్ధపు బడ్జెట్ అన్నారు.2019 ఎన్నికల ముందు హడావుడిగా పసుపు,కుంకుమ అని మోసం చేశారనీ,కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.3.40 కోట్లు ఆదాయం వస్తుందని భ్రమ పెట్టడం జరిగిందన్నారు. కానీ ఆదాయం లక్ష కోట్ల రూపాయలు మించి లేదన్నారు.మహిళలకు రూ.1500లు పథకం అమలు కాలేదు,వంటగ్యాస్ సిలిండర్ ఇప్పటి వరకు ఒక సిలిండర్ మాత్రమే ఇచ్చారన్నారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను,కార్యకర్తలను తూలనాడి మాట్లాడటం హేయమైన చర్యగా అభివర్ణించారు. నిరుద్యోగులకు భృతి కల్పించలేదనీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు కాలేదన్నారు. అదే విధంగా సూపర్ సిక్స్ అమలుకు నోచుకోవడం లేదనీ పేర్కొన్నారు. బెల్టుషాపులు విపరీతంగా పెరిగిపోయాని, మద్యం గ్రామ గ్రామాన పేదవారికి డోర్ డెలివరీ చేసి తెలుగుదేశం పార్టీ నాయకులు దోచుకుంటున్నారనీ ఆరోపించారు.సచివాలయాలను నిర్వీర్యం చేసే పనిలో ప్రభుత్వం ఉందన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు త్వరితగతిన అందుబాటులో ఉండేందుకు సచివాలయాలు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టినట్లు తెలిపారు. పథకాలన్నీ నిర్వీర్యం చేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం పట్ల వ్యతిరేకత పెరుగుతుందన్నారు. ఆ క్రమంలోనే కూటమి ప్రభుత్వం బయటకి ఒకటి లోపల ఒకటి చెపుతూ వైఎస్ఆర్సిపి నాయకుల కార్యకర్తలకు అనేటువంటి వాళ్లకి ఎవ్వరికీ మేము సహయ సహకారాలు గాని పనులు గాని చేయము అని వార్నింగ్ ఇవ్వడంపై మండిపడ్డారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైసిపి పార్టీ సానుభూతి పరులకు ఏ పని చేయొద్దు అని చేసిన అనుచిత వ్యాఖ్యలకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పరిపాలన చేయటం చేతకాకపోతే గతంలో జగన్మోహన్ రెడ్డి పార్టీలు చూడకుండా ఎలా చేశారో చూసి నేర్చుకోవాలన్నారు. మీ కన్నా చిన్నవాడైనటువంటి జగన్మోహన్ రెడ్డి గడిచిన ఐదు సంవత్సరాల్లో అందరికీ ఆదర్శప్రాయంగా కులాలు, మతాలు, రాజకీయ పార్టీలను చూడకుండా వివక్ష లేకుండా నిలిచారన్నారు. వైయస్సార్ పార్టీకి ఓట్లు వేసిన వారికి ప్రభుత్వం పథకాలు ఇవ్వనప్పుడు వైయస్సార్ పార్టీకి ఓట్లు వేసిన వాళ్లు ప్రభుత్వానికి పన్నులు ఎందుకు కట్టాలి అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, కె.చెంచయ్య,ఎంపీపీ హరిబాబు,జోగి రాజా,పిన్నిబోయిన ప్రసాద్,అంకమ్మరావు సముద్రాలు గౌడ్,దేవరకొండ గోపి,పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీతోనే సాధ్యం

(మొదటిపేజీ తరువాయి)

కార్మికులను తొలగిస్తున్నారని ఇటువంటి చర్యలను నివారించడం సంఘటిత ఉద్యమాలతోనే సాధ్యమన్నారు. దోపిడీ వ్యవస్థ నిర్మూలన జరగాలంటే కార్మికుల ఐక్యత అవసరమని నేటి కూటమి ప్రభుత్వం మునిసిపాలిటీలలో అప్కాస్ విధానం రద్దు చేసి 279జీఓ అమలు చేయాలని చూస్తుందని తక్షణమే ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసు కోవాలన్నారు. 1920లో స్థాపించబడిన ఏఐటీయూసీ ఎన్నో ఉద్యమాలు చేపడితే కార్మికులకు హక్కులు వచ్చాయని నేటికీ కార్మికుల హక్కుల కోసం నిష్పక్షపాతంగా పోరాడుతున్న ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ మాత్రమేనన్నారు. పోరాటాల ద్వారానే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని కార్మికుల హక్కుల కోసం ఉద్యమాలకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.నేటికీ ప్రభుత్వ పాఠశాలల ఆయాలకు,అంగన్ వాడీ కార్మికులకు, జీతాలు చెల్లించని కూటమి ప్రభుత్వం బహు బాగా పరిపాలన చేశామని చెప్పుకుంటున్నారని,నేటి కార్మికులు పంజాబ్ రైతులు చేసిన ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని సంఘటిత ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ముందుగా ఏఐటీయూసీ జెండాను సీనియర్ కామ్రేడ్ ఏఐటీయూసీ చీరాల నియోజకవర్గ అధ్యక్షులు అచ్యుతుని బాబూరావు ఆవిష్కరించారు. తదనంతరం ఏఐటీయూసీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐటియూసీ నాలుగవ మహాసభ గౌరవ అధ్యక్షులుగా మేడ వెంకట్రావు, అధ్యక్షులుగా దేవతోటి నాగేశ్వరరావు, నియోజకవర్గ కార్యదర్శిగా బాసి పైడయ్య, ఉపాధ్యక్షులుగా గొనబోయిన బ్రహ్మయ్య, దొక్కా మాల్యాద్రి, నిద్రబంగి అప్పన్న, సహాయ కార్యదర్శులుగా చిరుమల ప్రకాష్, బత్తుల వీరమ్మ, సూరద శాంతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జొన్నాదుల భారతి,కొరివి భాను ప్రకాష్,కోశాధికారి రామేశ్వరం కుమార్, కమిటీ సభ్యులుగా షేక్ షాహిన, ఝాన్సీ,ఓసిపల్లి బుజ్జమ్మలతో కూడిన 17మంది కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోటి దాసు,ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు జల్లి భాగ్య శ్రీధర్,కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

'మేజర్ల'కు అందని సాగునీరు

(మొదటిపేజీ తరువాయి)

రావాల్సి ఉండగా తక్కువ మేతాదులో వస్తున్నది. మేజర్ల చివరి ఆయుకట్టులో తాళ్లూరు మండలం పొరదల ఉన్నది. కనీసం ఆరుతడి పంటల కైనా నీరు అందుతుందను కుంటే అది కూడ నిరాశే ఎదురైనది. మండల పరిధిలో 12వేల ఎకరాలు సాగు ఉన్నది. వరితో పాటు ఆరు తడి పంటలు కూడ మిర్చి, పొగాకు, ప్రత్తి మొక్కజొన్న సాగు చేసారు. సాగర్ నీరు సక్రమంగా రాక పోతుండటంతో రైతులు వ్యయ ప్రాసాలకు వోర్చి వాగులు, కుంటలలో ఉన్న కొద్ది పాటి నీటిని దూర ప్రాంతాల నుండి ఇంజన్ల ద్వారా తరలించి ఆరుతడి పంటలను కాపాడుకుంటున్నారు. అయితే పొట్టదశలో ఉన్న వరి మాత్రం నిలువునా ఎండు పోతుంటం చూసి రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ పెద్దల స్పందించి కరువది రజానగరం మేజర్లకు నీటికి అందించి రైతన్నను ఆదుకోవాలని కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి

మారం వెంకట రెడ్డి, రైతు, కొత్త పాలెం

కరువది మేజర్‌లో వరి పొట్ట దశలో ఉన్నది. ఆరు తడి పంటలు సాగు చేసారు. అధికంగా పెట్టుబడులు పెట్టి పంటను కాపాడుకున్నాము. ఇప్పుడు చేతికి అంది వచ్చే దశలో నీరు లేక పోతే తీవ్రంగా నష్టపోతాము. సమస్యను దర్శి నియోజక వర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి దృష్టికి తీసుకువెళ్లి నీరు వచ్చేలా తగిన చర్యలు తీసుకోవటానికి రైతులం సమాయత్తం అవుతున్నాము.

అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి

విశాలాంధ్ర-ఒంగోలు : పేదరికాన్ని ఎదిరించి ఉన్నత విద్యావంతునిగా ఎదిగిన బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్. అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులందరూ ఉన్నత స్థితిలో నిలవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామాత్యులు డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి పిలుపునిచ్చారు. తల్లిదండ్రుల ఆశలను, ఆకాంక్షలను నెరవేర్చేలా పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. ఇంటర్మీడియట్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులతో ఆదివారం తూర్పునాయుడుపాలెంలోని తన స్వగృహం నుంచి మంత్రి జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించిన జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శ్రీ.ఎన్.లక్ష్మానాయక్ మాట్లాడుతూ ఆయా హాస్టళ్లలోని విద్యార్థుల వివరాలను, పరీక్షలకు వారిని సన్నద్ధం చేస్తున్న తీరును వివరించారు. జిల్లాలోని 61 ప్రీమెట్రిక్, 20 పోస్టు మెట్రిక్ హాస్టళ్ళలో 7274 మంది విద్యార్థులు ఉంటున్నట్లు తెలిపారు. వీరిలో 911 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారని, 505 మంది ఇంటర్ మొదటి సంవత్సరం, 411 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నట్లు వివరించారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా విద్యార్థులతో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి ఈ విధంగా ముఖాముఖి నిర్వహించడంపై మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మంత్రి శ్రీబాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ విద్యతోనే మెరుగైన భవిష్యత్తు సాధ్యమని అన్నారు. అందుకే విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా హాస్టళ్ళ మరమ్మ తులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లను మంజూరు చేసిందని, ప్రకాశం జిల్లాకు 13 కోట్ల రూపాయలను మంజూరు చేసిందన్నారు. అన్ని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో అంబేద్కర్ విగ్రహాన్ని పెడతామన్నారు. వీటితోపాటు ఒంగోలులోని సంతపేటలో రూ.6.50 కోట్లతో బాలికల హాస్టల్ , సంతనూతలపాడులో రూ.2 కోట్లతో బాలుర హాస్టల్, చీమకుర్తిలో రూ.2 కోట్లతో బాలికల హాస్టల్, ఒంగోలులోని సక్కుబాయమ్మ ప్రభుత్వ కాలేజీలో రూ.5.50 కోట్లతో బాలికల హాస్టల్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. సక్కుబాయమ్మ కాలేజీ విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అప్పటివరకు పరివర్తన భవనములో వారికి ఆశ్రయం కల్పించడానికి 60 లక్షల రూపాయలతో మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించి ఉత్తమ విద్య, నాణ్యమైన భోజనము పెట్టడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ఉపయోగించుకొని ఉత్తమ మార్కులతో అందరూ ఉత్తీర్ణులు కావాలని మంత్రి సూచించారు. అందుకే విద్యార్థులలో ధైర్యం నింపేలా నేరుగా తానే మాట్లాడుతున్నట్లు చెప్పారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా సంక్షేమ హాస్టల్ విద్యార్థులు ప్రతిభ చాటాలన్నది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ఆశయం అని మంత్రి తెలిపారు. పదవ తరగతి విద్యార్థులకు అవసరమైన ఆల్ - ఇన్ - వన్ గైడ్లు ఇచ్చామని, పదవ తరగతితో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం అవసరమైన చోట ట్యూటర్లను కూడా పెట్టామని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి బి.పి.టి. బియ్యంతో భోజనం పెడతామని, అన్ని హాస్టళ్లలో మంచినీటి కోసం ఆర్వో ప్లాంట్స్ పెడతామని, సకాలంలో ట్రంకు పెట్టెలు, దుప్పట్లు, టవల్స్ ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. హాస్టళ్లలో ఉంటున్న పేద విద్యార్థులకు ప్రభుత్వమే గార్డియన్ అని మంత్రి చెప్పారు. వారి రక్షణకు, భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. హాస్టళ్లలో ఈ విధమైన చర్యలు తీసు కుంటున్నామని, విద్యార్థుల మిస్సింగ్ కేసులను త్వరగా ఛేదించామన్నారు. వెల్ఫేర్ ఆఫీసర్లు, వార్డెన్లు కూడా ప్రతి ఒక్క విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మంత్రి ఆదేశించారు. లోగ్రేడులో ఉన్న విద్యార్థులు కూడా మెరుగైన మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా చూడాలని, పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సమయం ఉన్నందున ప్రతి నిమిషాన్నీ సద్వినియోగం చేసుకుని ఆత్మవిశ్వాసంతో సన్నద్ధమయ్యేలా చేయాలని సూచించారు. స్టడీ అవర్స్ పై మరింత దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రతిభగల విద్యార్థులతో గురుకుల కాలేజీలలో అడ్మిషన్లకు దరఖాస్తు చేయించాలని అధికారులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. సింగరాయకొండ గురుకుల కాలేజీలో డిగ్రీ కోర్సులు కూడా ప్రవేశపెడుతున్న విషయాన్ని ప్రస్తావించారు. కేవలం చదువే కాకుండా విద్యార్థులకు అవసరమైన వినోదం కోసం రిక్రియేషన్ సౌలభ్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకువచ్చే ఆలోచన చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లాలోని వివిధ హాస్టళ్లలో జరుగుతున్న మరమ్మతు పనులను కూడా ఈ ఆన్లైన్ లోనే మంత్రి వీక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఏ.పీ.ఈ.డబ్ల్యు.ఐ.డీ.సీ. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్ బాబుకు ఈ పనులకు సంబంధించి మంత్రి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ జూమ్ మీటింగులో జిల్లాలోని అందరు ఏ.ఎస్.డబ్ల్యూ.ఓ.లు తమ పరిధిలోని హాస్టళ్ళ నుంచి పాల్గొన్నారు.

స్టడీ అవర్స్ తనిఖీ చేసిన డీఈవో

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండలంలోని తాటిచెర్ల మోటు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పదవ తరగతి విద్యార్థులకు జరుగుతున్న స్టడీ అవర్స్‌ను ప్రకాశం జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల యొక్క సామర్థ్యాలను వారు పరిశీలించి తెలుగు ఉపాధ్యాయుడితో మాట్లాడారు.

ఐక్య ఉద్యమాలతోనే హక్కులు సాధన

విశాలాంధ్ర-ఒంగోలు : ముస్లిం హక్కుల సాధనం కోసం, సమస్యల పరిష్కారానికి నగరంలోని ముస్లింలు అందరూ ఒకే తాటిమీదకు వచ్చి పోరాడాల్సిన అవసరం ఉందని అందుకు ముస్లింలు విడివిడిగా కాకుండా ఐక్యం అవ్వాలని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు అవసరం ఉందని అందుకు సన్నాహకంగా ఏర్పాటు చేసిన ముస్లిం సంఘాల సమావేశంలో సీనియర్ ముస్లిం నాయకులు సయ్యద్ సర్దార్ గారి అధ్యక్షతన ఒంగోలు బండ్లమిట్టలో ముస్లిం ప్రజాసంఘాలు, ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఒంగోలు నగరంలో అనేక ముస్లిం సంఘాలు హక్కుల కోసం పనిచేస్తున్నప్పటికీ అందరూ కలిసి ఐక్య ఉద్యమాల ద్వారానే ముస్లిం హక్కుల సాధన జరుగుతుందని, ఒంగోలు నగరం లో సుదీర్ఘ కాలంగా ఉన్న ముస్లిం శ్మశానవాటిక, షాదీఖానా నిర్వహణ, ఉర్దూ స్కూల్ ఏర్పాటు లాంటి సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారం కోసం అలాగే ముస్లింలకు న్యాయంగా అందాల్సిన సంక్షేమం కోసం, రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ కోసం, హక్కుల సాధనకోసమే ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటులో ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. ఒంగోలు నగరం లోని యాభై మునిసిపల్ డివిజన్లలో ఉన్న ముస్లిందరినీ చైతన్య పరచి అందరినీ కలుపుకుని త్వరలోనే ఏర్పాటు చేయబోయే ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కోసం సన్నాహకంగా ఒక స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ స్టీరింగ్ కమిటీకి సమన్వయకర్తగా పఠాన్ కరిముల్లా ఖాన్ ఉండగా ప్రజాసంఘాల నాయకులు సయ్యద్ ఇస్మాయిల్, ఎండి రఫీ అహ్మద్,షేక్ అబ్దుల్ రవూఫ్, మహమ్మద్ రఫీ, సయ్యద్ హుస్సేన్, సయ్యద్ కరిముల్లా, ఎంఏ సాలార్, సయ్యద్ ఇలియాజ్ స్టీరింగ్ కమిటీ సభ్యులుగా ఉన్నారు, గౌరవ సలహా దారులుగా సయ్యద్ సర్దార్, షేక్ కరిముల్లా, షేక్ మహబూబ్ భాయ్ ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ షబ్బీర్, షేక్ కరీం, షేక్ ఖాదర్ వలి, సయ్యద్ సలీం, షేక్ గౌస్ బాషా, షేక్ ఫయాజ్, సయ్యద్ సమద్, పఠాన్ గౌస్ ఖాన్ పాల్గొన్నారు.

శ్రీనివాస ఈఎన్‌టీ హాస్పిటల్ ప్రారంభం

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలు నగరం 60 అడుగుల రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీనివాస ఇఎన్‌టి హాస్పటల్ దర్శి నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్లకు ఒంగోలు నగర మేయర్ శ్రీమతి గంగాడ సుజాత, వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి,యువ పారిశ్రామిక వేత్త శిద్దా సుధీర్‌బాబు అభినందనలు తెలిపారు.

రెవెన్యూ అధికారుల గైర్హాజరుపై జడ్పీటీసీ ఆగ్రహం

విశాలాంధ్ర-వెలిగండ్ల : ప్రతి మూడు నెలల కోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి రెవిన్యూ అధికారులు నిర్లక్ష్య వైఖరితో హాజరుకాకపోవటం ఏమిటని వెలిగండ్ల జడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిపి రామన మహాలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జెడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి మాట్లాడుతూ తహసిల్దార్ తో పాటు రెవెన్యూ సిబ్బంది ఎందుకు హాజరు కాలేదని, ప్రతిరోజు రైతులు ప్రజలు రెవిన్యూ కార్యాలయం చుట్టూ తిరగలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి సకాలంలో పనులు ఎందుకు చేయటం లేదని ప్రశ్నించారు. రెవిన్యూ సమస్యలపై సమావేశాలలో మాట్లాడలంటే వారు హాజరు కాకపోవటంతో ప్రజా సమస్యలు ఎలా పరిష్కరిస్తామని అన్నారు. ఎంపీపీ రామన మహాలక్ష్మి మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి హాజర కానీ అధికారులకు నోటీసులు పంపించాలని ఎంపీడీవో షేక్ మహబూబాషాను ఆదేశించారు. అనంతరా ఆమె మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి మంచినీటి సమస్య రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో సర్పంచులు అధికారులు ఎంపిటీసీలు పాల్గొన్నారు.

పాత కక్షలతో ఇరువర్గాల ఘర్షణలు

విశాలాంధ్ర-పుల్లలచెరువు : పుల్లలచెరువు మండలంలోని ముటుకుల గ్రామంలో అదే గ్రామానికి చెందిన ఎర్రదేశి చిన్న లింగయ్య అలియాస్ వెంకటేశ్వర్లు, అతని కుటుంబ సభ్యులపై ఎరదేశి మణికంఠ, మరో 12 మంది వ్యక్తులు పాత గొడవలను మనసులో పెట్టుకొని వారిపై కర్రలు, రాళ్లతో దాడి చేసి కొట్టి బలమైన గాయాలు చేసి ఆడవారని కూడా చూడకుండా కొట్టి వారి శరీరంపై ఉన్న బట్టలు లాగి బజారులో అందరి ముందు అవమానించిన 13 మంది వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి మార్కాపురం కోర్టు వారి ముందు హాజరు పరచగా కోర్టు వారు నిందితులకు 14 రోజులు రిమాండ్ విధించారు. పుల్లలచెరువు మండలంలో ఎవరైనా గొడవలు, అల్లర్లు చేసిన యెడల వారిపై తీవ్రమైన చర్యలు ఉంటాయని పులలచెరువు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఎల్.సంపత్ కుమార్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-పుల్లలచెరువు : శనివారం రాత్రి సుమారు 09.40 గంటల సమయం ప్రాంతంలో పుల్లలచెరువు మండలంలోని కొత్తూరు గ్రామంలో నివాసం ఉండే దండేబోయిన కోటేశ్వరరావు (39), తన ఇంట్లో ఉన్న ఆర్ఓ వాటర్ ప్లాంట్‌కి నీళ్లు పట్టి మోటార్ ఆపే క్రమంలో వాటర్ ప్లాంట్ స్విచ్ బోర్డ్‌కి అమర్చిన ప్లగ్ బాక్స్‌కు ఉన్న ప్లగ్ తీసే సమయములో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కి గురై చనిపోయినాడు. దానిపై అతని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పుల్లలచెరువు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఎల్.సంపత్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

16న ఆర్ఎస్ఎస్ వార్షికోత్సవం

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని రామకృష్ణ మఠములో ఆర్ ఎస్ ఎస్ వార్షికోత్సవ సన్నాహక సమావేశం ఆర్ఎస్ఎస్ గిద్దలూరు సంపర్క్ రామకృష్ణ పాల్గొని ఈ నెల 16 తేదీన జరుగు వార్షికోత్సవ సమావేశముకు హిందూ బంధువులు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని అందుకు కార్య కండ సభ్యులు కృషి చేయాలని కోరడం జరిగింది. ఈ సమావేశం లో గిద్దలూరు కార్య కండ నిర్వక్ శివమల్ల రెడ్డి, ప్రకాశము జిల్లా సమరాత ఫౌండేషన్ కన్వీనర్ ఏనుగుల పద్మావతి, ఆనంద్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు భవ నాసి వెంకట రామాంజనేయులు, గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అపి శెట్టి ఉదయ్ శంకర్,రాష్ట్ర కిసాన్ మోర్చ కార్య వర్గ సభ్యులు పిడతల రమేష్ రెడ్డి,బీజేపీ జిల్లా ఓబిసి మోర్చ ప్రధాన కార్యదర్శి బాధుల్ల, సంజయ్, సంఘ ప్రముఖులు పాల్గొనడం జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి కార్య కండ సభ్యుడు ఈ వార్షికోత్సవం విజయవంతం అవడంతో ముఖ్య పాత్ర పోషించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమం విజయవంతం చేయడం ప్రతి హిందూ బాధ్యతగా భావించాలి అని సూచించడం జరిగింది.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-సంతనూతలపాడు : మండలంలోని చిలకపాడు గ్రామనికి చెందిన పెట్లూరు శేషమ్మకు ముఖ్యమంత్రి సహాయ నిధుల కింద 80 వేల రూపాయల చెక్కును సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ ఆదివారం ఒంగోలులోని మర్రిచెట్టు దగ్గర తన నివాసం నందు వారి కుటుంబీయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు దావులూరిఅనిల్ కుమార్ వంకాయలపాటి యలమంద తదితరులు ఉన్నారు.

ప్రైవేటు కార్యక్రమంలో కృష్ణ కిషోర్ రెడ్డి

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని నరవ రోడ్డులోని శ్రీ సీతారామ కళ్యాణ మండపంలో గిద్దలూరు మండల విద్యాశాఖ అధికారి జింకా వెంకటేశ్వర్లు పదవీ విరమణ సందర్భంగా ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథి ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి పాల్గొని దంపతులను సన్మానించి శుభాకాంక్షలు తెలియచేశారు. గిద్దలూరు మండల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేటు వేడుకల్లో 'కోటపాటి'

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని మోపాడు గ్రామానికి చెందిన మేడసాని రమణయ్య – సుజాత దంపతుల కుమార్తె స్వర్ణ నిధి నిశ్చితార్ధ వేడుకలు ఆదివారం బెంగళూరులో వైభవముగా నిర్వహించారు. ఈ వేడుకలకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధన్ రావు, సుశీల దంపతులు హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

గాంధీ ఈ టెక్నో స్కూల్‌లో సైన్స్ డే

- అబ్బుర పరిచిన విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు
- తిలకించిన కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర-ఒంగోలు : నగరంలోని మంగమూరు డొంకలో ఉన్న గాంధీ ఈ – టెక్నో స్కూల్లో సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు అబ్బుర పరిచాయి. ప్రిన్సిపల్ సిహెచ్ మాధురి పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో కరస్పాండెంట్ అళ్ళ శ్రీనివాసరెడ్డి, ముఖ్య అతిథిగా గణిత ఉపాధ్యాయులు శివ ప్రసాద్ హాజరై సైన్స్ ప్రదర్శనలను తిలకించారు. విద్యార్థులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. కరస్పాండెంట్ అళ్ళ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్ ఎంతో ఉపయోగపడుతోందన్నారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా విద్యార్థుల్లో మేధా శక్తి పెరగాలన్నారు. ఆ దిశగా విద్యార్థులకు నైపుణ్యతను అందిపుచ్చుకునేలా మా ఉపాధ్యాయ బృందం బోధన చేయడం జరుగుతుందన్నారు. ప్రిన్సిపల్ సిహెచ్ మాధురి మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనలకు అనుగుణంగా విద్యా బోధన మా ప్రత్యేకత అన్నారు. విద్యార్థి దశ నుండే వారికి జ్ఞాపక శక్తి, మేధస్సును పెంచే దిశగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. టెన్త్ ఇన్చార్జి ఉమ దేవి, ఉపాధ్యాయులు నరసింహారావు, రాజు, జోషి, వెంకటేష్, ఉపాధ్యాయురాళ్ళు శైలజ, సుబ్బలక్ష్మి, నాగమణి, ప్రియాంక, శ్రావణి, భారతి, రమాదేవి, శ్వేత, శ్రీలత, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

విశాలాంధ్ర-ఒంగోలు : స్వర్గీయ పెండ్యాల సుబ్బాయమ్మ 7వ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలో శివం శరణాలయంలోని వృద్ధులతో పాటు శివం సంచార వాహనం ద్వారా అనాధలకు యాచకులకు 300 మందికి భోజనం వసతి ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పేల ప్రోలు చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి కొమ్మి రమణయ్య మాట్లాడుతూ పెండ్యాల సుబ్బాయమ్మ వర్ధంతికి వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నగరంలోని పేదలకు అన్నదానంతో పాటు శివం శరణాలయం నందు వృద్ధులకు పండ్లు కాయలు పంపిణీ తో పాటు అన్నదానం నిర్వహించి మానవత్వం చాటారని తెలిపారు సుబ్బాయమ్మ పవిత్ర ఆత్మ శాంతి కలగాలని కోరుతూ నివాళు లర్పించారు. ఈసేవ కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ అధ్యక్షులు మారెళ్ళ సుబ్బారావు, సుబ్బాయమ్మ కుమార్తె చాగంటి వెంకటరత్నం. మనవరాలు మారెళ్ళ రాజేశ్వరి, పేలప్రోలు చిలకమ్మ, ధనాల విజయలక్ష్మి కొమ్మిచెంచమ్మ రాధిక తదితరులు పాల్గొంటున్నారు.

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-పామూరు రూరల్ : శనివారం నెలవంక కనిపించడంతో పట్టణంలోని మసీదులలో ఆదివారం ముస్లిం సోదరులు పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలను ప్రారంభించారు. తెల్లవారుజామున సహర్‌తో ప్రారంభమయ్యే ఉపవాస దీక్ష సాయంత్రం ఇఫ్తార్‌తో ముగిసింది. రంజాన్ ప్రారంభ వేడుకలకు మసీదులు విద్యుత్ కాంతులతో శోభాయమానముగా అలంకరించారు. స్థానిక మర్కజ్ మసీదు ఉపవాస దీక్షలను స్వీకరించిన వారితో పండగ వాతావరణం సంతరించుకున్నది. 30 రోజులపాటు దీక్షలు ముగిశాక నెలవంక దర్శనాంతరం మరుసటి రోజు రంజాన్ పండుగను జరుపుకుంటామని మత పెద్దలు తెలిపారు.

9న సీవీఎన్ రీడింగ్ రూమ్, క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలు

విశాలాంధ్ర-ఒంగోలు : ఈ నెల 9వ తేదీ ఆదివారం స్థానిక సీవీఎన్ రీడిరగ్ రూం, క్లబ్ పాలకమండలి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి చిల్లర వెంకట సుబ్బారావు తెలిపారు. ఆదివారం ఉదయం సివిఎన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ జరుగుతుందన్నారు. అదేరోజు మధ్యాహ్నం 4 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఎన్నికలలో రెండు ప్యానెల్స్ తరపున పోటీదారులు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఆంధ్రకేసరి ప్యానెల్, మహాత్మాగాంధీ ప్యానెల్ తరపున పోటీదారులు ఉన్నారని వీరు కాకుండా స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారన్నారు. మొత్తం 29 మంది పోటీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శి, ఈసీ మెంబర్లను ఓటర్లు ఎన్నుకోవటం జరుగుతుందన్నారు. ప్రస్తుతం జీవితకాల సభ్యులతో కలిపి మొత్తం 970 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ప్రతి ఓటరు తప్పనిసరిగా క్లబ్ నుంచి జారీ చేసిన గుర్తింపుకార్డుతో పాటు ఆధార్ కార్డ్ తీసుకురావాలని అన్నారు. ఎన్నికల కోసం రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేశామన్నారు. షటిల్ కోర్టులో ఒకటి, క్యారమ్స్ కోర్టులో ఒకటి పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేశామని వెంకట సుబ్బారావు తెలిపారు. ప్రతి ఓటరుకు బ్యాలెట్ పేపర్ ఇవ్వటం జరుగుతుందన్నారు. అయితే ఓటర్ ఈసీ మెంబర్లలో కేవలం 6 గురికి మాత్రమే ఓటు వేయాలని అంతకన్నా ఎక్కువమందికి ఓటు వేస్తే ఆ ఓటు చెల్లదని ఆయన పేర్కొన్నారు. సీవీఎన్ క్లబ్ బయట ఏర్పాటచేసే టెంట్లలో మాత్రమే ఓటర్లు, పోటీలో ఉన్న అభ్యర్థులు ఉన్నారన్నారు. కేవలం ఓటర్లను ఎన్నికల సమయంలో క్లబ్ లోపలికి అనుమతిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో ప్రిసైడిరగ్ అధికారులు కనమాల రాఘవులు, వారణాసి శ్రీనివాస శాస్త్రి, అంగలకుర్తి ప్రసాదు, చిల్లర నందకిషోర్ పాల్గొన్నారు.

కథా రచయిత్రి చిలకమర్తి పద్మజకు సత్కారం

విశాలాంధ్ర-ఒంగోలు : సాహిత్యం, సంస్కృతి, చరిత్ర ప్రచురణలో నేషనల్ బుక్ ట్రస్ట్ చేస్తున్న సేవలు నిరుపమానమైనవని ఆంధ్రకేసరి విద్యా కేంద్రం కరస్పాండెంట్ చెంచురామయ్య పేర్కొన్నారు. జానుడి – సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ప్రైవేటు లెక్చరర్స్అండ్ టీచర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఒంగోలు అంజయ్య రోడ్డులోని ఎస్ఎస్ కంప్యూటర్స్‌లో ఆదివారం ఉపాధ్యాయిని చిలకమర్తి పద్మజ అనువదించిన' ఫలహారాల చెట్టు' బాలల సాహిత్యం, ఎస్ ఎన్ ఆర్ కిక్స్ అనే స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకం ఆవిష్కరణ జరిగింది. సభకు జానుడి సాహితీ సంస్థ డైరెక్టర్, న్యాయవాది డాక్టర్ నూకతోటి రవికుమార్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా చెంచురామయ్య, విద్యావేత్త డాక్టర్ షాకిర్ లు పాల్గొని పుస్తకాలను ఆవిష్కరించి ప్రసంగించారు. స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాన్ని ఆవిష్కరించిన డాక్టర్ షాకీర్ మాట్లాడుతూ ప్రపంచంతో మనల్ని అనుసంధానం చేసే భాష ఇంగ్లీషు అని, ప్రతి ఒక్కరు ఇంగ్లీషులో ప్రవేశం సాధించాలని కోరారు. ఫలహారాలు చెట్టు పుస్తకాన్ని కథా రచయిత వై. యస్. దిగ్విజయ్ సమీక్ష చేశారు. ఈ సభలో ఒకేషనల్ జూనియర్ కాలేజెస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులుగా ఎంపికైన శ్రీనిధి ఒకేషనల్ జూనియర్ కాలేజ్ కరెస్పాండెంట్ వాయల విజయ రత్నం, జేకే ఒకేషనల్ జూనియర్ కాలేజ్ కారస్పాండెంట్ అనపర్తి కృష్ణఫర్, ఎంఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మక్కెన థామస్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి సంచాలకులుగా లెక్చరర్లు జాన్ శామ్యూల్, ఏ బ్రహ్మయ్య, దారా మోహన్ రావులు వ్యవహరించగా మహేశ్వర చారి, రామ సుబ్బారావు, సాయి రాజేష్, వెంకటేశ్వర్లు,సాల్మన్, జాలాది మోహన్ తదితరులతో పాటు పలువురు సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

చెరువులో దిగిన వ్యక్తి మృతి

విశాలాంధ్ర-పర్చూరు: పర్చూరు పోలీసు స్టేషన్ పరిధి లోని జాగర్లమూడి ఎస్సీ కాలనీ చెరువులో దిగిన వ్యక్తి మృతి... వివరాలు లభించాయని ఎస్సై మాల్యాద్రి ఆదివారం తెలిపారు. శనివారం పొరపాటున వ్యక్తి చెరువులో జారటంతో లోతుల్లోకి వెళ్ళి మృతి చెందారని తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఎస్సీ కాలనీకి చెందిన బొందు ప్రభాకరరావు ఎలియాస్ ప్రభుదాసు(42) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మృతునికి భార్య దీనమ్మ, ఇద్దరు ఆడ పిల్లలు కలరు. చెరువులో లోతు ఎక్కువగా ఉండటంతో అగ్నిమాపక సిబ్బంది వెదికినా జాడ తెలియలేదు. ఆదివారం బాపట్ల నుండి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు చెరువులో దిగి మృతుని బయటకు తీశారు. మృతుని పంచనామా పూర్తిచేసి శవపరీక్ష ప్రభుత్వ వైద్యశాలలో పూర్తిచేసి మృతుని కుటుంబ సభ్యులకు అందించారు. సంఘటన స్థలం వద్ద తహశీల్దార్ రవికుమార్, ఎస్సై మాల్యాద్రి, పోలీసు సిబ్బంది, విఆర్‌ఓ తులసి కోటేష్, అగ్నిమాపక, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఉన్నారు. కాలనీలో విషాదఛాయలు అలుముకు న్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ప్రశాంత వాతావరణంలో టైప్ రైటింగ్ పరీక్షలు

విశాలాంధ్ర - రేపల్లె: స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ రేపల్లె కేంద్రంలో ఆదివారం నిర్వ హించిన టైపురైటింగ్ పరీక్షలకు మొత్తం 40 మందికి గాను 39 మంది హాజరయ్యారని టైపు రైటింగ్ చీఫ్ సూ పరిండెంట్ ఎస్.చంద్రశేఖర్ చెప్పారు. మీడియాతో మాట్లాడుతూ ఇంగ్లీష్ లోయర్ గ్రేడ్ 21 మందికి గాను 20 మంది,ఇంగ్లీష్ హయ్యర్ గ్రేడ్‌కి 15 మంది,తెలుగు లోయర్ గ్రేడ్‌కి ఒక్కరూ తెలుగు హయ్యర్‌కి ముగ్గురు హాజరయ్యారని పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని గవర్న మెంట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, టైపు రైటింగ్ ఎగ్జామ్స్ చీఫ్ సూపరిండెంట్ ఎస్.చంద్రశేఖర్,ఎంఈ తెలిపారు.

మసీదు నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - పర్చూరు: మండల కేంద్రమైన పర్చూరులో దాతల సహాయ సహకారంతో నూతనంగా నిర్మించనున్న మసీదుకు ఆదివారం శంకుస్థాపన గావించారు.గతంలో ఉన్న పాత మసీదులో వర్షాకాలంలో ప్రార్థన చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో దాన్ని పడగొట్టి దాని స్థానంలో కొత్త మసీదు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.మసీద్ నిర్మాణ కమిటీ సభ్యులు,దాతలు,మత పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.మసీదు నిర్మాణం త్వరితగతిన పూర్తి కావాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరు తమకు చేతనైనంతా ఆర్థిక చేయూత అందజే యాలని మసీదు కమిటీ సభ్యులు కోరారు.ఈ కార్యక్రమంలో మసీద్ ముతవల్లి షేక్ నబీసా,చీరాల మసీదు ముఫ్తీ హబీబుల్లా,నరసరావుపేట మౌలానా సాహిద్,మసీదు ఇమామ్,ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

నాగేశ్వరరావుకు ఘన సత్కారం



విశాలాంధ్ర - అద్దంకి: గుంటూరుకు చెందిన విశ్రాంత బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్ 350 కథలు,ఐదు నవలలు, రెండు టీవీ ఎపిసోడ్స్ చేసిన ప్రముఖ కవి పెనుమాక నాగేశ్వరరావుకు అద్దంకి సాహితీ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆదివారం అద్దంకిలో జరిగిన కార్యక్రమంలో సాహితీ రత్న బిరుదు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. విశ్రాంత ఆర్జేడి దేవ పాలన, జ్యోతి చంద్రమౌళి,చుండూరి మురళి, ఆర్వి రాఘవరావు పాల్గొన్నారు.

రహదారులకు మోక్షం ఎప్పుడూ...?

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని పలు అంతర్గత రహదారులకు మోక్షం కలగటం లేదు,వాటి దుస్థితి దయనీయంగానే ఉన్నది. యద్దనపూడి,మార్టూరు మండలాలను కలిపే వివిధ గ్రామాల మధ్య మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించి నప్పటికీ పలు గ్రామాల రోడ్లు ఇంకా మరమ్మ తులకు నోచుకోలేదు. ఈ దెబ్బతిన్న రోడ్లతో ప్రజలు విసిగిపోతున్నారు.యద్దనపూడి మండలంలో మె రుగైన రవాణా కోసం గోతులమయమైన బీటీ రహదారిని అభివృద్ధి చేసేందుకు 10లక్షల నిధుల ను ప్రభుత్వం విడుదల చేసింది.పనులు దక్కించు కున్న గుత్తేదారు వేగవంతంగా పనులు పూర్తిచే యగా నిర్మాణంలోని లోపాలు ఉన్నాయి.వేసిన కొద్దిరోజులకే లేచిపోతున్న బీటీ,యనమదల వద్ద మరమ్మతులు చేసిన రోడ్డులో లోపాలు

బహిర్గతమయ్యాయి,పలుచోట్ల పరిచిన బీటీ లేచిపోతుంది.మరికొన్ని ప్రాంతాల్లో మరమ్మతులు చేయకుండా గోతులను వదిలేశారు.యద్దనపూడి సమీపంలో రోడ్డును మధ్యలో తవ్వడంతో రాత్రివేళ ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అక్కడక్కడ రహదారులు ప్రమాదకరంగా ఉన్నాయి.గన్నవరం పూనూరు మధ్య,దండుదారి మార్టూరు మధ్య,రహదారి పరిస్థితి దయనీయంగా మారింది.

ఇప్పటికైనా మరమ్మతులను సక్రమంగా పూర్తిస్థాయిలో చేపట్టాలని గ్రామీణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

చిన్నారి ప్రాణాలు కాపాడండి

దాతల ఆర్థిక సాయం కోసం ఎదురుచూపు...

విశాలాంధ్ర - బల్లికురవ : అల్లారు ముద్దుగా పెంచుకున్న కూమార్తె ప్రమాదకర వ్యాధితో మృత్యుతో పోరాడుతుండగా ఆర్థిక స్థోమత లేని ఆ తల్లిదండ్రులు దాతలు ఎవరైనా ఆర్థిక సాయం చేసి తమ కూమార్తెను బతి కించాలని తల్లిదండ్రులు దాతల ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నారు. మండ లంలోని కొప్పెరపాడు గ్రామానికి చెందిన బొంత శ్రీవల్లి (9) గత 15 రోజుల నుంచి బ్రెయిన్ ట్యూమర్ బ్రెయిన్ ఇన్ఫెక్షన్ అనే వ్యాధితో విజయవాడలోని రెయిన్ బో హాస్పిటల్‌లో ఆక్సిజన్ విత్ స్ట్రక్చర్ మీద చావు బతుకుల మధ్య పోరాడుతుంది. చిన్నారి తల్లిదండ్రులైన బొంత ఏసుబాబు, దివ్యభారతిలకు ఒక అమ్మాయి ఒక అబ్బాయి ఉన్నారు.వీరు రోజువారి కూలీ పని చేసు కుంటూ పిల్లల్ని పోషించుకుంటున్నారు.ఇటీవల శ్రీవల్లి అనారోగ్యానికి గురవటంతో వైద్యశాలలో పరీక్షలు నిర్వహించగా బ్రెయిన్ ట్యూమర్‌గా వైద్యులు గుర్తించారు.అప్పుడు నుండి వైద్య శాలలో చికిత్స అందిస్తున్నారు.ఇప్పటికే చిన్నారి వైద్య ఖర్చులు నిమిత్తం దాదాపు నాలుగు లక్షల రూపాయల వరకు ఖర్చు అయినవి.చిన్నారి సీరియస్ కండిషన్లో ఉందని రోజుకి సుమారు లక్ష రూపాయల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్తున్నారు.మరో 15 రోజులు వైద్యశాలలో చికిత్స అందించాల్సిన అవసరం ఉందని అందుకు మొత్తం 15 లక్షలు వరకు ఖర్చు అవుతుంది అంత ఆర్థిక సోమత తమ వద్ద లేదని తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నా రు. రెక్కాడితే గాని డొక్కాడని ఆ కుటుంబం చిన్నారి వైద్యం కోసం డబ్బులు లేక కూతురు ప్రాణాలు కాపాడుకునేందుకు దాతలు ఎవరైనా ఆర్థిక సాయం అందించాలని రెండు చేతులు జోడించి ప్రార్థిస్తున్నారు.ఫోన్ పే నెంబర్లు 7997246303 9010298154 ఆర్థిక సాయం అందించాలని కోరారు.

యోగాతో మానసిక ఉత్తేజం

విశాలాంధ్ర - వేమూరు : యోగా ద్వారా మా నసిక ఉత్తేజం కలుగుతుందని అదేవిధంగా ఏకాగ్రతపై దృష్టి సారించవచ్చని వేమూరు ఎస్సై రవికృష్ణ అన్నారు.జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం వేమూరు బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు యోగా నేర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు ఆటపాటల్లో కూడా రాణించే విధంగా కృషి చేయాలన్నారు.ఈ సందర్భంగా విద్యా ర్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.కార్యక్రమంలో మహిళా పోలీస్ సిబ్బంది ఉపాధ్యాయులు ఉన్నారు.

జనసేన ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర - యద్దనపూడి : రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు జనసేన నాయకుడు మన్నేం శ్రీకాంత్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ అన్నదానం కార్యక్రమంలో జనసేన నాయ కులు నిర్వహించారు.యద్దనపూడిలోని బస్టాండ్ వద్ద 500 మందికి అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో యద్దనపూడి మండల అధ్యక్షుడు గనిపిశెట్టి అయ్యప్ప, నారి శెట్టి ప్రవీణ్ కుమార్,ఇంకొల్లు మండల అధ్యక్షులు రామకృష్ణారెడ్డి,ఇంకొల్లు ఉపాధ్యక్షులు కోడే లక్ష్మణ్,యద్దనపూడి మండల ప్రధాన కార్యదర్శి కటారి వెంకయ్య నాయుడు,యద్దనపూడి గ్రామ అధ్యక్షులు తేజ,మారుతి, ఏడుకొండ,శ్రీనివాస రావు,జి. కోటేశ్వ రరావు,బ్రహ్మం టకసాల,కే.నాగేశ్వరరావు,జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి

పశుసంవర్ధక శాఖ తెనాలి డీడీ డాక్టర్ వై.పద్మావతి

విశాలాంధ్ర - నిజాంపట్నం : పశు వులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పక వేయించాలని పశు సంవర్ధక శాఖ తెనాలి డీడీ డాక్టర్ వై. పద్మావతి అన్నారు.మండలంలోని కూచి నపూడిలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు,బ్రుసెల్లు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా ఆమె హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు, బ్రుసెల్లు టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో ఈ నెల 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుంద న్నారు.ఈ మాసంలో పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని అలాగే 4 నుండి 8 నెలల మధ్య లో ఉన్న పెయ్యి దూడ లకు బ్రుసెల్లు టీకాలు వేయించాలని సూ చించారు.గాలికుంటు వ్యాధి అనేది చాలా ప్రమాదకరమని అది సోకితే పాడి పశువులలో గణనీయంగా పాలు తగ్గుతాయని,చూడి గేదెలు ఈసుకుపోతాయని, ఈ వ్యాధి సోకిన గేదలు తిరిగి చూడి కట్టడం చాలా కష్టంగా ఉంటుందని అందుకే దీనిని ఎకనామిక్ డిసీస్ అంటారని చెప్పారు.బ్రుసెల్లు టీకా ఆడదూడలకు వాటి జీవితంలో ఒకసారి టీకా వేయిస్తే చాలని ఎప్పటికీ బ్రుసెల్లు అనే వ్యాధి రాదని చెప్పారు. కూచినపూడి పశువైద్యాధికారి డాక్టర్ హేమ ప్రియ,ఎల్లయ్య,రామారావు, బొర్రా సురేంద్ర, పశువైద్య సిబ్బంది,పాడి రైతులు పాల్గొన్నారు.

సిమెంట్ కర్మాగారంలో భద్రతా మాసోత్సవాలు

విశాలాంధ్ర- దాచేపల్లి : పెదగార్లపాడు లోని చెట్టినాడ్ సిమెంటు కర్మాగారంలో ఆదివారం జాతీయ భద్రతా మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులకు వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అందులో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్లాంట్ హెడ్ సీహెచ్ సీతారాములు, హెచ్ఆర్ హెడ్ బీవీఆర్ రాజు, సేఫ్టీ హెడ్ వెంకట్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే నసీర్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గుంటూరులో నిర్మాణం లోని ఉన్న మూడు వంతెన నిర్మాణ పనులను ఆదివారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ పరిశీలిం చారు. ఈ సందర్భంగా అధికారులతో ఇప్పటి వరకు జరిగిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాల్లో నాణ్యతకు రాజీపడొద్దని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు నగరాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ ప్రకారం పనులు చేపడుతున్నామని తెలిపారు. ఆర్వోబీల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో పనులు చేపట్టామని చెప్పారు. ఈ పనులు పూర్తయితే గుంటూరులో ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందని అన్నారు. పనులు పురోగతిని పరిశీలించామని, వేగవంతంగా పూర్తి చేసేందుకు ఆదేశాలిచ్చామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట సంబంధిత అధికారులు, పార్టీ నాయకులు ఉన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-మంగళగిరి : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళగిరి పట్టణంలో వివేకానంద విద్యాలయంలో సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేకానంద విద్యాలయంలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థినీ, విద్యార్థులు చేసిన ప్రాజెక్టులను స్మార్ట్ సిటీ, డ్యాం, డైజెస్టివ్ సిస్టం, హైడ్రో ఎలక్ట్రిసిటీ, యానిమల్ హేబిటేషన్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, వివిధ రకములైన ప్రాజెక్టులను చూసి తల్లిదండ్రులు, స్కూల్ యాజమాన్యం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ సైన్స్ అనేది మన రోజువారి జీవితంలో కీలకపాత్ర పోషిస్తుంది. సర్ సివి రామన్ చేసిన అపారమైన సేవలకు గుర్తింపుగా జాతీయ సైన్స్ దినోత్సవంను జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, తల్లిదండ్రులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ పోలీస్ హల్‌చల్

విశాలాంధ్ర-తాడేపల్లి: సిమెంట్ ఫ్యాక్టరీలో నకిలీ పోలీస్ ఆదివారం హల్చల్ చేశాడు. సుమారు 30 సంవత్సరాలు ఉన్న యువకుడు మద్యం సేవించి, తాను పోలీస్ డిపార్ట్‌మెంట్ అని, తనకు కొంత డబ్బులు ఇవ్వాలని స్థానికులను డిమాండ్ చేశారు. కొంతమంది అతను అడిగిన అమౌంట్‌ను సమర్పించు కున్నారు. అతని వాలకం, మాట్లాడుతున్న తీరు చూసి పెద్ద ఎత్తున ప్రజలు పోగై తనని నిలదీశారు. పోలీస్ డిపార్ట్‌మెంట్ ఇచ్చిన ఐడి కార్డ్ చూపించమని అడిగారు. పరిస్థితి విషమిస్తుందని, ప్రజలందరూ తిరుగుబాటు చేస్తారని ఊహించి తాను అసలు పోలీసు కాదని ఒప్పేసుకున్నాడు. స్థానికులు తాడేపల్లి పోలీసులకు సమాచారం అందించారు. కేసు విచారిస్తున్నారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలని, అగ్రిగోల్డ్ ఆస్తులను పరిరక్షించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.మంత్రు నాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలసి అసోసియేషన్ నాయకులతో కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ యాజమాన్యం 8 రాష్ట్రాలలోని 32 లక్షలమంది నుండి పలు స్కీముల పేరుతో ప్రత్యక్షంగా రూ.6,380 కోట్లను డిపాజిట్ల రూపంలో సేకరించిందని వెల్లడించారు. మన రాష్ట్రంలో 19.52 లక్షలమంది నుండి 3,986 కోట్లను సమీకరించిందని వెల్లడించారు. ఒక్కొక్కరు వందల కోట్లు వ్యక్తిగత ఆస్తులుగా కుటుంబ సభ్యుల పేర, బినామీల పేరున పెద్దమొత్తాలను దాచుకుని కంపెనీ బోర్డు తిప్పేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సమర్థవంతమైన అధికారుల బృందం తో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, బాధితులకు న్యాయం చేయాలని, బినామీ ఆస్తులను, కుటుంబ సభ్యుల పేర వున్న ఆస్తులను జప్తు చేయించాలని కోరారు. అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటుచెయ్యాలన్నారు. జప్తు చేసిన ఆస్తుల రక్షణ బాధ్యతను సి.ఐ.డి చీఫ్ పర్యవేక్షణలో మండల రెవెన్యూ, పోలీసు అధికారులకు అప్పగించి కాపాడాలని, యాజమాన్యం దోచుకున్న ఆస్తులను రికవరీ చేయించాలన్నారు. అగ్రిగోల్డుకు చెందిన భూముల వాస్తవ స్థితిని బట్టి చిన్న సేద్యపు కమతాలుగాను, ఇండ్ల స్థలాలకు పనికివచ్చే వాటిని చిన్న చిన్న ప్లాట్లుగాను వేసి బయటి కొనుగోలుదారులకు బహిరంగ వేలం ద్వారా విక్రయించాలన్నారు. అత్యవసర వైద్యం, విద్య, బిడ్డల పెళ్ళిళ్ళు లాంటి అవసరాలు ఉన్నవారికి, లక్షలోపు డిపాజిట్ చేసిన చిన్న పొదుపుదారులకు తక్షణ చెల్లింపులకు తగిన ఏర్పాట్లుచేసి మరో డిపాజిట్టారుడు బలికాకుండా ఆదుకోవాలని కోరారు. ఈ అంశాలను సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి తగు విధంగా న్యాయం చేయటానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు జంపని హనుమంతరావు, అంజనీ దేవి, కె కోటేశ్వరమ్మ, సీతారామయ్య, షేక్. మౌలాలి, టి పవనకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్తిపాటికి అసోసియేషన్ నాయకులు వినతి

ఇంటి స్థలంతో పాటు
నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి: సీపీఐ

విశాలాంధ్ర-మంగళగిరి : నిరుపేద ప్రజలకు ఇళ్ల స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ నాయ కులు కోరారు. మంగళగిరి మండలం నవులూరు గ్రామంలోని మక్కెవారిపే టలో ఇళ్ళు లేని నిరుపేద ప్రజలకు పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామా లలో మూడు సెంట్లు ఇవ్వాలని కోరు తూ అర్జీలను పూర్తిచేసే కార్యక్రమాన్ని ఆదివారం సీపీఐ నాయకులు చేప ట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నియో జకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌లు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలకు పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామా లలో మూడు సెంట్లు ఇచ్చి వారికి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వా లని, కొండపోరంబోకు స్థలాలలో నివసిస్తున్న పేద ప్రజలకు ఇళ్లపట్టా లను మంజూరు చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వర రావు, 17వ వార్డు శాఖ కార్యదర్శి గండికోట దుర్గారావు, పాలెం నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేరప్రవృత్తిని విడనాడాలి: డీఎస్పీ

విశాలాంధ్ర-మంగళగిరి : రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ఎలాంటి గొడవలకు, భూదందాలకు పాల్పడకూడదని నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ హెచ్చరించారు. ఆదివారం మంగళగిరి గ్రామీణ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, అలాగే గ్రామీణ ప్రాంతాలలో విద్వేషాలు సృష్టించకుండా ఉండాలని, అన్ని వివాదాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ హెచ్చరించారు. ప్రజలను భయాందోళనకు గురిచేస్తే పీడీ యాక్ట్ కేసులు నమోదు అలాకాకుండా గొడవలు సృష్టించి చేస్తామని ఆయన రౌడీషీటర్లను హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాలలో ఎవరైనా రౌడీషీటర్లు, రౌడీయిజానికి పాల్పడినట్లయితే గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మురళీకృష్ణ గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి గ్రామీణ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్, ఎస్సై మహేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెనిగళ్ల సూర్యకుమారికి నివాళి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : విజయవాడ నగరంలోని ప్రముఖ విద్యా సంస్థ శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీ చైర్మన్ నరేంద్ర బాబు మాతృమూర్తి వెనిగళ్ళ సూర్యకుమారి నివాళి కార్యక్రమం మంగళగిరి పట్టణంలోని సీకే కన్వెన్షన్‌లో ఆదివారం జరిగింది. నగర ప్రముఖులు, విద్యావేత్తలు, బంధుమిత్రులు, శ్రీ గోసలైట్స్ సిబ్బంది తదితరులు వెనిగళ్ళ సూర్యకుమారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఘన నివాళి సమర్పించారు. వారి ప్రేమాభిమానాలను మంచితనాన్ని కొనియాడుతూ, వారితో తమకున్న అనుబంధాన్ని మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. వారి కుటుంబానికి సంతాపం తెలియజేసారు. గుంటూరు జిల్లా, దోనేపూడి గ్రామంలో, 1941 అక్టోబర్ 10వ తేదీన వీరమాచినే సత్యనారాయణ చౌదరి, మంగమ్మ పుణ్య దంపతులకు జన్మించిన వెనిగళ్ల సూర్యకుమారి చదువుల్లో చక్కగా రాణించి, ఆ రోజుల్లోనే పీయూసీ ఉత్తీర్ణులయ్యారు. 1957 మే 19వ తేదీన వెనిగళ్ల పార్థసారథిని వివాహమాడి అన్యోన్య దాంపత్యం సాగించి ఆదిదంపతులకు మారుపేరుగా నిలిచారు. తన పర బేధం లేకుండా, చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా బంధుమిత్రులందరికీ ప్రేమాభిమానాలను పంచే వారు. తన మంచితనాన్ని అందరికీ పంచి, మంచికి మారుపేరుగా వేనోళ్ళ కొనియాడబడి, అందరి హృదయాల్లో సుస్థిర నివాసం ఏర్పరుచుకున్న మాతృమూర్తి వెనిగళ్ళ సూర్యకుమారి చిరస్మరణీయులు.

పల్నాడు అభివృద్ధికి కృషి చేస్తా..

విశాలాంధ్ర-రెంటచింతల : వరికెపూడి ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యే వరకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ కెవిస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన రెంటచింతల ఉపాధ్యాయిని డాక్టరు ఎంబి చిన్నమ్మ పదవీ విరమణ సన్మాన సభలో పాల్గొన్నారు. పల్నాడు అక్షరాస్యత, అభివృద్ధిలో వెనుకంజలో ఉందన్నారు. మాచర్లలో పీజీ కేంద్రం, రెంటచింతలలో జడ్పీ ఉన్నత పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. 60 శాతం అక్షరాస్యత ఉన్న పల్నాట చిన్నమ్మ లాంటి ఉత్తమ టీచర్ల సేవలను ప్రభుత్వం సద్వినియోగం చేసుకుంటే అక్షరాస్యత శాతం పెరుగుతుందన్నారు. అనంతరం మండలంలో ఉపాధ్యా యులు, విద్యార్థులు, గ్రామస్థులు చిన్నమ్మను ఘనంగా సన్మానించారు. చిన్నారులు వేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ శివనాగేశ్వర రావు, ప్రేమ్ కుమార్, అరుణ్ కుమార్, రాజకుమార్, ఫాదర్లు మర్రెడ్డి, భరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

విశాలాంధ్ర-మంగళగిరి : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మంగళగిరి గ్రామీణ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ హెచ్చరించారు. ఆదివారం మంగళగిరి మండలం కాజా టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేయగా నిబంధనలను ఉల్లంఘించిన వారిపై జరిమానా విధించారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని ఆయన హెచ్చరించారు. ఇతర వాహనాలను నడిపేవారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని ఆయన అన్నారు. అతివేగంగా ప్రమాదకరమని, వాహనాలను అతివేగంగా నడపకూడదని ఆయన సూచించారు. అలాగే సెల్ఫోన్ డ్రైవింగ్ త్రిబుల్ రైడింగ్ చేయరాదని, మద్యం సేవించి వాహనాలను నడపరాదని అలా చేసిన యెడల చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని ఎస్ఐ వెంకట్ వాహనదారులను హెచ్చరించారు.

నీళ్ల కోసం నిధులు కేటాయించాలని నిరసన

పాలేటి పల్లి రిజర్వాయర్‌ను విస్మరించిన పాలకులు

విశాలాంధ్ర-పీసీపల్లి : నీళ్ల కోసం నిధులు కేటాయించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పీసీపల్లి ప్రభుత్వ వైద్యాశాల సెంటర్లో నిరసన చేపట్టారు. పాలేటిపల్లి రిజర్వాయర్‌ను పాలకులు విస్మరించారని అన్ని రంగాల్లో వెనుకబడిన పీసీపల్లి మండలానికి కొంత ఉపయోగకరంగా ఉండేది పాలేటిపల్లి రిజర్వాయర్ మాత్రమేనని సుమారు 13 సంవత్సరాల నాడు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఎమ్మెల్యే గా వున్న సమయంలో రిజర్వాయర్‌ను నిర్మించారని ఆ తర్వాత పాలకులు కాలువలు మరిచారన్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో రిజర్వాయర్‌కు పుష్కలంగా నీరు చేరుతుందని ఈ సంవత్సరం కూడా రిజర్వాయర్లో నీళ్లు ఉన్నా ఆ పాలకులు కాలువలు నిర్మించలేదు. అందువల్ల రిజర్వాయర్ నిర్మాణం ఉద్దేశం అమలు జరగలేదన్నారు ఈ బడ్జెట్లో నిధులు సవరించి పాలేటి పల్లి రిజర్వాయర్ కాలవలు నిర్మాణానికి నిధులు కేటాయించాలని రైతు సంఘం నాయకులు నారపరెడ్డి మాలకొండయ్య అన్నారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా మండల ప్రజలు నిధులు మంజూరు కోసం ప్రజాప్రతినిధులతో మాట్లాడాలన్నారు. పిసిపల్లి మండలాన్ని అభివృద్ధి చేసేందుకు వలసలు నివారణకు సాగునీరు అవసరాల కోసం ఉన్న ఏకైక వనరు పాలేటి పల్లి రిజర్వాయర్ అని అన్నారు. ఈ రిజర్వాయర్ కాలువ నిర్మాణానికి వెంటనే నిధులు ఈ ఆర్థిక సంవత్సరంలోనే కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పాలేటి పల్లి రిజర్వాయర్ నిర్మించటం మూలంగా సుమారు 15 గ్రామాలకు భూగర్భ జలాలు పెరిగి తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉందన్నారు. కాలువలు నిర్మిస్తే మరో రెండు వేల ఎకరాల్లో సాగు చేసుకోవచ్చని తెలిపారు .ఈ విధంగా వెనుకబడిన మండలంలో ఉన్న పాలేటిపల్లి రిజర్వాయర్‌కు నిధులు కేటాయించాలని అన్నారు. కలుషిత నీరుతాగి, కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న పీసీపల్లి మండల వాసులను ఆదుకోవాలని వ్యాధులు నివారణకు వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో చేర్చి తక్షణం కుళాయిలు ద్వారా అన్నీ గ్రామాలకు సాగర్ నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు.గత 14 సంవత్సరాలుగా అలంకారప్రాయంగా, రికార్డులకే పరిమితమయిన నిమ్జ్ ప్రాంతంలో పారిశ్రామిక పనులు జరగలేదని అన్నారు కరణం రామారావు చొప్పరపు మాలకొండయ్య, నారపరెడ్డి చినమల కొండయ్య కొడవటికంటి కొండయ్య ,సంగన వీరస్వామి, గుంటగాని స్టీఫెన్,సగిలి నాగార్జున, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం నియోజకవర్గ వైసీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా వెన్నా వెంకటేశ్వర రెడ్డి

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : ఇటీవల ప్రకటించిన యర్రగొండపాలెం నియోజకవర్గస్థాయి పదవులలో భాగంగా దోర్నాల మండలానికి చెందిన సీనియర్ నాయకుడు వెన్నా వెంకటేశ్వర రెడ్డికి నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నియామకం జరిగింది. ఈ సందర్భంగా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా నియమించబడ్డ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రియాశీలకంగా పనిచేయడం జరిగిందని కనుక నా యొక్క సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం ఈ బాధ్య తలు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ పదవి రావటానికి సహకరించిన యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ కి అదేవిధంగా జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఒంగోలు పార్లమెంటు సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

నారాయణరెడ్డికి ఘన సన్మానం

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : మండల కేంద్రమైన దోర్నాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల యందు పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఎస్ వి.నారాయణరెడ్డి పదవి విరమణ సందర్భంగా ఆదివారం స్థానిక బొగ్గరపు కళ్యాణ మండపము నందు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి పదవి విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మార్కాపురం డిప్యూటీ డీఈవో శామ్యూల్ జాన్, మరియు ఎంఈవో మస్తాన్ నాయక్, మరియు, ఎంఈఓ రామదాసు నాయక్, ఎంఈవో, మల్లికార్జున నాయక్, ఎంఈఓ శ్రీనివాసులు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయులు నాయకులు మాట్లాడుతూ తన వృత్తి ధర్మాన్ని అంకితభావంతో పనిచేసి పాఠశాలకు తన వంతు కృషి చేశారని తెలియజేశారు. పాఠశాల అభివృద్ధికి, మరియు పాఠశాల విద్యార్థులు క్రమశిక్షణ రీతిలో నడిపించి పాఠశాలకు మంచి పేరు తెచ్చారని, అతని గురించి వివరించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు నారాయణ రెడ్డి, దంపతులను, పూలమాలతో, శాలువలతో ఘనంగా సన్మానించారు. పాఠశాల సిబ్బంది, అందరూ పాల్గొని సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బట్టు సుధాకర్ రెడ్డీ, బట్టు రవాణా రెడ్డీ, షేక్. మంజూరు బాషా, కేతు, మురళి, గంటా రవాణా రెడ్డీ, కంచర్ల చెన్నయ్య,ఉపాధ్యాయులు , నాగమూర్తి, వర్ధన్, మరియు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : చీరాల నుండి నెల్లూరు జిల్లాకు తరలి పోతున్న అక్రమ రేషన్ బియ్యం లారీలను పట్టుకున్న సంఘటన ఆదివారం నాగులుప్పలపాడు సమీపంలో జరిగింది. వివరాల మేరకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారు అన్న సమాచారంతో ఒంగోలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించగా నాగులుప్పలపాడు సమీపంలో ఇంకొల్లు క్రాస్ రోడ్డు వద్ద ఏపి 39 టియు1015, ఏపి 39 టియు 4972 నెంబర్లగల లారీలను తనిఖీ చేయగా ఒక్కో వాహనంలో 50 కేజీల బస్తాల 350 చొప్పున రేషన్ బియ్యం ఉన్నాయని తెలిపారు. మొత్తం 700 బస్తాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వాహన డ్రైవర్‌లు అరవపల్లి గోపి మరియు ఇమ్రాన్ లు ఇచ్చిన వాంగ్మూలం మేరకు ఈ బియ్యం నెల్లూరు జిల్లా కావలికు చెందిన వంశీరెడ్డి, వాహన ఓనర్ శామ్యూల్ మరియు మాల్యాద్రిలు అక్రమంగా సేకరించిన రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు గుర్తించి వారిపై నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ సిఐ రాఘవరావు, ఎస్ఐ నాగేశ్వరరావు, ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి రాజ్యలక్ష్మి విజిలెన్స్‌అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది ఉన్నారు.

వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : దోర్నాల మండలంలోని సీపీఎం ఆఫీస్ నందు కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా దగ్గుపాటి సోమయ్య మార్కాపురం ఏరియా కార్యవర్గ సభ్యులు పాల్గొని ఈ ప్రాంతంలో ఉన్న శ్రీ పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు బడ్జెట్లో కేవలం 309 కోట్లు మాత్రమే కేటాయించారని ఎద్దేవ చేశారు. దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి ,దోర్నాలమండల కార్యదర్శి సుందరయ్య కాలనీ శాఖ కార్యదర్శి ఏసేపు, కార్యకర్తలు దావీదు, సుంకన్న ,పిచ్చయ్య పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : మండల కేంద్రమైన దోర్నాల్లోని 8 9 క్లస్టర్ విభాగంలో మరియు చింతల అగ్రహారం కట కానిపల్లి, యూనిట్41 ఇన్‌ఛార్జి, 221, 22 ,23, బూతులలో, సభ్యత్వ కార్డులును శనివారం దోర్నాలలో టీడీపీ కార్యకర్తలకు సభ్యత్వ కార్డులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మైనార్టీ నాయకుడు షేక్ మాబు, రాష్ట్ర టిఎన్టిసీ నాయకుడు బట్టు సుధాకర్ రెడ్డిలు, మరియు ఈదర మల్లయ్య, ఆదివారం సభ్యత్వ కార్డులను పార్టీ నాయకులు అందజేశారు. . ఈ సందర్భంగా యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ, అండగా ఉంటుందని తెలిపారు. దోర్నాల మండలంలో 12 వేల తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సభ్యత్వం చేసుకున్నారని తెలిపారు. క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జ్‌లు గ్రామాలలో ప్రతి సభ్యత్వం తీసుకొన్న ప్రతి ఒక్కరికి కార్డు చేరావేయడంతో పాటు ప్రభుత్వం. నిర్వహిస్తున్న సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, రామచంద్ర కోట టిడిపి నాయకుడు దేవయ్య, బొమ్మలాపురం టిడిపి నాయకుడు శివారెడ్డి, పోలయ్య వెంకటేశ్వర్లు, సత్యనారాయణ చలమయ్య,వెంకటరెడ్డి, మరియు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర - పొదిలి : నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని లాంఛనంగా ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ ఆదివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ కాలంనాటి పొదిలి పోలీస్ స్టేషన్ మరమ్మతులు చేయించి మెరుగైన సేవలు కల్పించి బ్రిటిష్ కాలం నాటి బిల్డింగును కనుమరుగు కాకుండా పునఃప్రారంభం చేయడం ఎంతైనా ఉందని అన్నారు. పొదిలి పోలీస్ స్టేషన్ 85 సంవత్సరాలు చరిత్ర కలిగిందని, 71 సంవత్సరాలు పోలీసు స్టేషన్ కలిగి ఆ తరువాత నూతనంగా స్టేషన్ నిర్మాణం జరిగి స్టేషన్ అక్కడికి తరలించడం జరిగిందని అన్నారు. ఇప్పుడు మరలా పాత స్టేషన్ మరమత్తులు చేయించి అధునాతన సౌకర్యాలతో ఏర్పాటుచేసి ప్రారంభించడం జరిగిందన్నారు. తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయిలో పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మాదిగ అమరవీరుల త్యాగాలు మరువరానివి

విశాలాంధ్ర-సంతనూతలపాడు : మాదిగ అమర వీరులు యావత్తు మాదిగ జాతికి అందించిన సేవలు మరువరానివని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు తోరటి ఆనంద్ మాదిగ హితబోధ చేశారు. మండలంలోని చిలకపాడు గ్రామం నందు ఆదివారం ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన మాదిగ అమరవీరుల దినోత్సవం కార్యక్రమానికి హాజరై వారు ఈ సందర్భంగా మాట్లాడారు. ముందుగా కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు, ఎమ్మార్పీఎస్ నేతలు పాలపర్తి శ్రీను మాదిగ అట్లూరి అశోక్ కుమార్ మాదిగ అట్లూరి బిక్షాలు మాదిగ బుడంగుంట నాగేశ్వరావు మాదిగ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పాలపర్తి రవికుమార్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : లోక్ సభ ప్యానల్ స్పీకర్ బాపట్ల పార్లమెంటు సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ జన్మదిన సందర్భంగా బాపట్లలోని క్షీర భావన్నారాయణ స్వామి గుడిని దర్శించుకుని,స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితులు వద్ద ఆశీర్వచనాలు తీసుకున్నారు. తెన్నేటి పుట్టిన రోజు సందర్భంగా చీరాల నియోజకవర్గంలోని కోటయ్య అనాధ వృద్ధ శరణాలయం,ఊటుకూరి వెంకటసుబ్బమ్మ వెల్ఫేర్ సొసైటీ వారి పాండురంగ వృద్ధాశ్రమంలో మధ్యాహ్నం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం నిర్వహించి వృద్ధులకు నూతన వస్త్రాలు పండ్లు,స్వీట్స్, పిల్లలకి కేక్ కట్ చేసి పిల్లలకు తినిపించి పుస్తకాలు,పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగల రాజశేఖర్,భీమా లీలా కృష్ణ,రైల్వే బోర్డు నెంబర్ పఠాన్ రాజేష్,దగ్గుమల్లి కిరణ్ కుమార్,ఆర్మీ విజయ్, చీరాల టీడీపి పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీనివాసరావు,గవిని మణికంఠ,వెదుళ్ళపల్లి బధిరుల ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పఠాన్ రాజేష్‌కు సన్మానం

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : స్టువర్టుపురం తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు బొగిరి రామారావు ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం ఫౌండేషన్ చైర్మన్,రైల్వే బోర్డ్ నెంబర్ పఠాన్ రాజేష్‌ను గ్రామ కమిటీ సభ్యులు,టీడీపీ నాయకులు పూలమాల,శాలువాలతో ఘనంగా సత్కరించారు.బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ ఆదేశాలను అనుసరిస్తు నిరంతరం బాపట్ల పార్లమెంట్ అభివృద్ధికి కృషి చేస్తున్నా ఆయనకి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఉన్నత పదవులను అలంకరించాలని బొగిరి రామారావు కోరారు.ఎంపి తెన్నేటి కృష్ణప్రసాద్ ఆదేశాలను అచరిస్తూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు,గవిని ప్రసాద్,మడా చిట్టిబాబు గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ల్లో ప్రత్యేక యోగా

విశాలాంధ్ర - బాపట్ల : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో మహిళా సాధికారత వారోత్సవాలు ప్రారంభించారు. ఈ నెల8వ తేది వరకు నిర్వహించనున్నారు.మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సాధించిన ప్రగతిని గురించి,మహిళల హక్కులు, సమానత్వం,భద్రత, రక్షణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తీసుకుంటున్న చర్యలు గురించి అవగాహన కల్పించేందుకు,మహిళల శక్తిని, మానసిక స్థైర్యాన్ని,స్వీయ రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.అందులో భాగంగా ఆదివారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో మహిళలకు,విద్యార్థినిలకు ప్రత్యేకంగా యోగ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.యోగా, మెడిటేషన్ అనేవి భారతీయ సంస్కృతిలో ఒక భాగమని,ఇవి మన శరీరం,మనస్సులను సమతుల్యం చేస్తాయని, వీటిని అభ్యసించడం ద్వారా మానసిక వత్తిడిని జయించ గలుగుతామని, ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో యోగాసనాలు గురించి తెలుసుకొని వాటిని ఆచరించాలని పోలీసు అధికారులు సూచించారు.

త్వరలో తాగునీటి సమస్యలకు పరిష్కారం

- జలజీవన్ మిషన్ కింద ప్రత్యేక నిధులు
- తాగునీటికి రూ.36.55 కోట్లు మంజూరు
- సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు
- ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేస్తాం
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

విశాలాంధ్ర - యద్దనపూడి : పర్చూరు నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని టీడీపీ బాపట్ల పార్లమెంట్ మాజీ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు.జలజీవన్ మిషన్ పథకం కింద పర్చూరు నియోజకవర్గంలోని 81 పనులకుగాను 36.55 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు.నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా గ్రామాలలో రక్షిత తాగునీటి సరఫరా,ఆర్వో ప్లాంట్ల నిర్మాణం,ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం,పైప్ లైన్ నిర్మాణం, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు తదితర పనులకు ఈ నిధులతో చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి వివరించారు.

సిఎం చంద్రబాబు సహకారంతో కోట్లాది రూపాయల నిధులు వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 8 నెలల్లో సీఎం చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక శద్ధతో గ్రామాలలో దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తున్నారన్నారు.చిన్నగంజాం మండలానికి 27 వర్కులు 8.19 కోట్లు,మార్టూరు మండలానికి నాలుగు వర్కులు 2.30 కోట్లు, ఇంకొల్లు మండలానికి 15 వర్కులకు 4.21 కోట్లు,కారంచేడు మండలానికి 16 వర్కులకుగాను 9.68 కోట్లు,పర్చూరు మండలానికి 13 వర్కులకు గాను 7. 34 కోట్లు, యద్దనపూడి మండలానికి 6 వర్కులకు గాను 4.84 కోట్లు మంజూర అయినట్లు ఎమ్మెల్యే ఏలూరి వివరించారు.గత వైసిపి ప్రభుత్వంలో తాగునీటి ప్రాజెక్టులు అస్తవ్యస్తంగా మారాయన్నారు.ఫిల్టర్ బెడ్ల మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు.మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి రూ.14 లక్షల కోట్ల అప్పుల్లో రాష్ట్రాన్ని ముంచినా పేదలకు మంచినీళ్లిచ్చే ప్రాజెక్టులకు మ్యాచింగ్ గ్రాంట్లు కూడా విడుదల చేయలేదన్నారు.వైసీపీ ఐదేళ్ల పాలనలో జలజీవన్ మిషన్ జీవం లేకుండా చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం జలజీవన్ మిషన్ లక్ష్యాలు అధిగమించి ప్రజలకు సురక్షిత నీరు అందించనున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల్లో ప్రత్యేక ప్రణాళికల ద్వారా మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు.

కరుణానిధికి పితృవియోగం

విశాలాంధ్ర-దర్శి : అఖిల భారత యువజనసమాఖ్య, (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్షులు రాచపూడి కరుణానిధి తండ్రి రాచపూడి పెద్ద కోటేశ్వరరావు (60) అనారోగ్యంతో శనివారం సాయంత్రం 3 గంటలకు దర్శి మండలం తూర్పు చౌటపాలెం గ్రామంలో తమ స్వగృహంలో మృతి చెందారు. జిల్లా సిపిఐ పార్టీ కార్యదర్శి ఎంఎల్ నారాయణ పెద్ద కోటేశ్వరరావు పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ పెద్ద కోటేశ్వరరావు గత కొన్ని సంవత్సరముల నుండి కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా పని చేశారని, కమ్యూనిస్టు భావాలు అలవర్చుకొని కమ్యూనిస్టు పార్టీ సభ్యుడుగా అనేక ఉద్యమాలలో, పోరాటంలో పాల్గొని గ్రామంలో దళిత బలహీన వర్గాలకు,పేదలకు అండగా నిలిచారని, ఆయన మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని అన్నారు. పెద్ద కోటేశ్వరరావు కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలుపుతూ పెద్ద కోటేశ్వరరావు మృతికి సంతాపం వ్యక్తం చేశారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో భారత కమ్యూనిస్టు పార్టీ దర్శి

నియోజకవర్గం కార్యదర్శి మారపాక రమేష్ బాబు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్సులు ఆర్ వెంకటరావు,పి రామారావు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి, జిల్లా సీపీఐ నాయకులు బోడాల వీరాంజనేయులు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రావు, బికేఎంయు జిల్లా ఉపాధ్యక్షులు జూపల్లి కోటేశ్వరరావు, శ్రీరామ్ శ్రీనివాసరావు,సీపీఐ జిల్లా నాయకులు రామయ్య, రామాంజి, దొనకొండ మండల సీపీఐ కార్యదర్శి చెన్నుబోయిన గురుమూర్తి,. మరియదాసు పెద్ద కోటేశ్వరావు మృతికిసంతాపం తెలిపిన వారిలో ఉన్నారు. ఆదివారంకోటేశ్వరరావు పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పొలాల్లోని 30 క్వింటాల మిర్చి చోరీ

విశాలాంధ్ర-త్రిపురాంతకం : పొలాల్లో అరబెట్టిన సుమారు 30 క్వింటాల మిర్చీని గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం కంకణాలపల్లి యస్సి కాలనీకి చేసిన బోయలపల్లి గాలయ్య తనకి వున్న పొలంలో 3 ఎకరాలు మిర్చి సాగు చేసాడు. అయితే మొదటి కోతకు మిర్చి కూలీలు దొరకలేదు.అయితే రెండో కొతలో మొత్తం మిర్చి పంటను కోయించాడు. తాను పండించిన పంట పరిసర ప్రాంతంలో కాళీ స్థలం లేకపోవడంతో మరొక పొలం వద్ద కాళీ స్థలంలో అరబెట్టాడు.అరబెట్టి తాలు కాయాలను ఏరించి గోతాలాలో ఎత్తెందుకు సిద్ధం చేసుకున్నాడు. అరబెట్టిన పంటకు రోజు రాత్రి కాపలాగా వెళ్లి అక్కడే పడుకునేవాడు. అయితే శనివారం రాత్రి తనకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో రాత్రి ఇంటి వద్దే నిదురించాడు. ఆదివారం ఉదయం వచ్చి తాను అరబెట్టిన పంట వద్దకు వెళ్లి చూడగానే అక్కడ కొన్ని కుప్పలు తరిగినట్లు అనిపించింది. మొత్తం మిర్చి పంటకు కప్పిన పట్టలు తీసి చూడగా సుమారు 30 క్వింటాలు పోయినట్లు గుర్తించాడు. చుట్టూ పరిసర ప్రాంతాలు పరిశీలించగా 4 చక్రాలా వాహనం చక్రాల గుర్తులు, గోతాలు అక్కడ పడి వున్నాయి. వెంటనే గ్రామస్థులకు సహాయంతో స్థానిక పోలీస్ స్టేషన్లొ పిర్యాదు చేసారు. విషయం తెలుసుకున్న యస్ ఐ శివ బసవరాజు తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు పండించిన పంటకు సుమారుగా 5 లక్షల రూపాయలు ఖర్చు చేశానని రైతు తెలిపాడు. పండించిన పంట తనకు దక్కక పోతే అప్పుల ఉభిలో కురుకుపోవడం తప్పదని వాపోతున్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి తన పంటను తనకు దక్కేలా చూడాలని కోరుకుంటున్నారు.

రేపు సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ సెలక్షన్స్

విశాలాంధ్ర - బాపట్ల : 34వ గుంటూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ సెలక్షన్స్ మంగళవారం బాపట్ల మున్సిపల్ హై స్కూల్ క్రీడా ప్రాంగణంలో సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి మంతెన సుబ్బరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలక్షన్స్‌లో పాల్గొనే క్రీడాకారులు 2009 మార్చి 30తరువాత పుట్టి ఉండవలని,ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు తీసుకొని రావలని,అలాగే బాల బాలికలు 55 కేజీల లోపు ఉండలన్నారు. సెలక్షన్స్ మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుండి జరుగుతుందని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు అంతర్ జిల్లాల పోటీల్లో ఉమ్మడి జిల్లా తరఫున పాల్గొంటారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పొన్నపల్లి వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం పొన్నపల్లి గ్రామానికి చెందిన పిట్టు బ్రహ్మా రెడ్డి (26) వారే నాగార్జున రెడ్డి ఇరువురు ద్విచక్ర వాహనంపై ఆదివారం మధ్యాహ్నం ఒకటిన్నర ప్రాంతంలో ఇంటికి వెళుతుండగా మద్యం మత్తులో ఉన్న బ్రహ్మారెడ్డి వాహనం డివైడర్ను ఢీకొట్టడంతో బ్రహ్మారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు.తీవ్ర గాయాల పాలైన నాగార్జున రెడ్డిని స్థానిక ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు.మృతుడికి భార్య ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.చిన్న కుమార్తె అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించి స్నేహితునితో మద్యం సేవించి ఇంటికి తిరిగి వెళుతున్న క్రమంలో ప్రమాదం చోటుచేసుకుంది. బ్రహ్మారెడ్డి మృతితో పొన్నపల్లిలో విషాదఛాయలు ఆలుముకున్నాయి.

పేకాటరాయుళ్ల అరెస్టు

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి మండలం చంద్రపాడు గ్రామంలో పొలాల్లో జోగులాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చీమకుర్తి సీఐ సుబ్బారావు తెలిపారు. ఆరుగురి వద్ద నుంచి రూ 24250 స్వాధీనం చేసుకుందామన్నారు. అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడితే చర్యలు తప్పుకొని సిఐ హెచ్చరించారు.